క్లుప్తంగా

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



స్పోకెన్ ఇంగ్లిష్ గురించి వివరిస్తున్న సౌమ్య

కె.కోటపాడు: తెలుగు భాషతో పాటు ఇంగ్లిష్‌పై కూడా చిన్నప్పటి నుంచే పట్టు సాధించాలని కె.కోటపాడు శాఖా గ్రంథాలయాధికారి సౌమ్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ గురించి వివరించారు. ఇంగ్లిష్ పదాల వినియోగం, వాటి అర్థాలను వివరించారు. అనంతరం క్రీడాపోటీలను నిర్వహించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట: స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఐయితంపూడి,నేతవానిపాలెం,కందిపూడి,దిబ్బిడి,పోలేపల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చెస్,క్యారమ్స్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి కృష్ణారావు తెలిపారు.

గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పనసలపాడు గిరిజనులు

నర్సీపట్నం: సాగు చేస్తున్న గిరిజనులకు కాకుండా గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సాగుదారులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద్ మాట్లాడుతూ తప్పుడు పట్టాలు మంజూరు చేసిన రోలుగుంట తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

నేడు వీరవల్లి అగ్రహారంలో గడప గడపకు..

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, స్థానిక సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు పాల్గొనున్నట్టు చెప్పారు.

ఏఎల్‌పురంలో..

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ ఇన్‌చార్జిగా రాజబాబు



కృష్ణమాదిగకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజబాబు తదితరులు

రావికమతం: మహాజన సోషలిస్ట్ పార్టీ చోడవరం నియోజక వర్గం ఇన్‌చార్జిగా రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన మంజేటి రాజబాబును నియమించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి విశాఖపట్నంలో పలు నియోజక వర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. ఈ సందర్భంగా మందకృష్ణమాదిగకు రాజుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు పలు గ్రామాల్లో బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలు నిర్వహించారు.



వెంకన్నపాలెంలో సీతారాములను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పాండవుల మెట్టపై వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న బూడి ముత్యాలనాయుడు



గరగమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రోలుగుంటలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో శారదా నది ఒడ్డున పాండవుల మెట్టపై వందేళ్ల చరిత్ర కలిగిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. శ్రీ కవిత అగ్రి ఫారమ్స్ అధినేత డి.వి. అప్పారావు సౌజన్యంతో శ్రీ భూ వరహా, జయ, విజయ, శ్రీచక్ర మేరువు, గరుడ, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. వేలాదిగా భక్తులు రావడంతో పాండవుల మెట్ట కిక్కిరిసింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూజలు

విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఆయన సతీమణి రమణమ్మ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు , పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర ప్రజా ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీ నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా గరగమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

దేవరాపల్లి: మండలంలోని ఏ. కొత్తపల్లిలో గరగమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవార జాము నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరగమాంబ అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని, పూజలు జరిపారు. అనంతరం ఆయనను స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, గరగమాంబ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధనను నిర్వహించారు.

వెంకన్నపాలెంలో

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ నేతలు వర్రి పాత్రుడు, భద్రాచలం, గోవిందరావు, తహసీల్దార్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: స్థానిక కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బుధవారం ఘనంగా ప్రతిష్ఠించారు. కనకదుర్గమ్మ ఆలయాన్ని నిర్మించిన రుత్తల చింతల్లి తన సొంత సొమ్ముతో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ సుర్ల నాగరత్నం,విగ్రహదాత చింతల్లి తన కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

లక్కవరం, అంబేరుపురాల్లో

చోడవరం: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మండలంలో లక్కవరం, అంబేరుపురం గ్రామాల్లో పండగ వాతావరణం ఏర్పడింది. లక్కవరంలో మోదకొండమ్మ తల్లి, అంబేరుపురంలో లక్ష్మమ్మ అమ్మవారి ఆలయాలు కొత్తగా నిర్మించారు. ఈ రెండు ఆలయాల్లో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, కలశప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం నుంచి వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.



అంబేరుపురంలో నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మమ్మ అమ్మవారి విగ్రహం



లక్కవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మోదకొండమ్మ ఆలయం

సీపీఎం నాయకుడు సత్తిబాబుకు నివాళి



సత్తిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సీపట్నం: విలువలతో కూడిన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి సత్తిబాబు అని పలువురు తెలిపారు. ఇటీవల మరణించిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్తిబాబు సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, పలువురు నాయకులు సత్తిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తిబాబు పేదల కోసం ఎనలేని సేవలు చేశారని సన్యాసిపాత్రుడు అన్నారు. ఈ కార్యక్రమంలో రుత్తల ఎర్రాపాత్రుడు, ఐద్వా నాయకులు ప్రభావతి, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తదితర్లు పాల్గొన్నారు.

స్వల్ప వడ్డీకి పంట రుణాలు



బ్యాంకు సేవలను వివరిస్తున్న మేనేజర్ వెంకట అప్పారావు

కె.కోటపాడు: స్థానిక డీసీసీబీ ద్వారా రైతులకు స్వల్ప వడ్డీకే పంట రుణాలను అందించనున్నట్టు బ్రాంచ్ మేనేజర్ వెంకట అప్పారావు తెలిపారు. రైతులు, వ్యాపారులు, స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న బ్యాంక్ సేవలపై బుధవారం ఆయన సిబ్బందితో కలిసి ప్రచారం చేశారు. సేవలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయేతర అవసరాలకు రూ.20 లక్షల వరకూ రుణాలను ఇవ్వనున్నట్టు తెలిపారు. వ్యవసాయదారులకు ట్రాక్టర్, పాడి గేదెలు, కోళ్ల, గొర్రెలు పెంపకానికి రుణాలతో పాటు భూమి అభివృద్ధికి దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తున్నట్టు వివరించారు.

ఈ కార్యక్రమంలో కె.కోటపాడు పీఏసీఎస్ సీఈవో ఆర్.చిన ఈశ్వరరావు, గోవింద, రాముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

మాడుగుల: జూన్ రెండవ తేదీ నుంచి జరిగే పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి బి.దేవుడమ్మ తెలిపారు. మండలంలో 217 మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. 10 వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. స్థానిక ఆర్‌సీఎం బాలికోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్

అయ్యన్న తనయుడిపై విరుచుకుపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నర్సీపట్నం: ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, టీడీపీ నాయకుడు చింతకాయల విజయ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. మున్సిపల్ తాత్కాలిక చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, పార్టీ అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, పార్టీ నాయకులు ఆరుగుల్ల రాజుబాబు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే విజయ్ తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు.

సభ్యత్వ, సంస్కారం లేకుండా మాట్లాడటం విజయ్‌కు తగదన్నారు. విజయ్ వ్యవహారశైలి వల్ల టీడీపీకి నష్టం జరుగుతుందన్నారు. 2014లో టీడీపీ అభ్యర్థిగా ప్రకటించకపోయినప్పటికీ ఎంపీగా పోటీ చేస్తున్నట్టు ఫ్లెక్సీలు వేసుకున్న ఘనుడు విజయ్ అని వారు తెలిపారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: క్రీడాలతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎస్ఆర్ షటిల్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. స్థానిక న్యూకాలనీ షటిల్ కోర్టులో ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన నూరే సతీష్, కడిమిశెట్టి మల్లేశ్వరరావును బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాల వయస్సులో రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం సాధించడం అభినందనీయమన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ షటిల్ పోటీలు ప్రతి ఏడాది దేశంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తుందని, మన రాష్ట్రంలో ఈ ఏడాది నిర్వహించడం, అందులో అనకాపల్లి జిల్లాకు తృతీయస్థానం దక్కడం శుభపరిణామం అన్నారు. క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని, క్రీడాకారులు నిత్యం యవ్వనంగా కనిపిస్తారని ఆయన చెప్పారు. క్రీడలపై దృష్టి సారిస్తే కరోనా వంటి విపత్తులను ఒడుర్కొనే శక్తి సొంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మదన్‌మోహన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కె.జె.పురం శివాలయానికి బోరు మంజూరు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుని సన్మానిస్తున్న భజన, సేవా బృందం సభ్యులు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం శివాలయానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తాగునీటి బోరు మంజూరు చేశారు. అభ్యర్థించిన వెంటనే బోరు మంజూరు చేసిన డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ శివాలయానికి చెందిన గౌరీ పరమేశ్వర భజన, సేవా బృందం సభ్యులు దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమములో సేవా బృందం సభ్యులు ఆడారి కన్నారావు, పెంటకోట సూరిబాబు, ఆడారి సూరిప్పారావు, యల్లపు పెంటయ్య, ఆడారి శివకేశవ, స్థానిక నాయకులు కాళ్ల అప్పలనాయుడు, సూరిశెట్టి అచ్చిమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



మాకవరపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు. జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పీహెచ్‌సీ నుంచి బస్టాండు వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పొగాకుకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవోలు జాన్సన్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎఫ్ నూతన కార్యవర్గం

రావికమతం: ట్రైబల్ రైట్స్ ఫోరం(టీఆర్ఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం రావికమతంలో ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ సంఘాన్ని ఎన్నుకున్నారు. టీఆర్ఎఫ్ జిల్లా నూతన అధ్యక్షుడిగా అల్లం ఎరకన్నదొర, ప్రధాన కార్యదర్శిగా గోగం వరహాలు దొర,సహాయ కార్యదర్శిగా కంఠముఖి బాబ్జి,ఉపాధ్యక్షుడిగా వడ్డీ దేముడు, తగ్గి దుర్గమ్మ,కోశాధికారిగా రొబ్బా సతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు మాట్లాడుతూ మైదాన గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. 50శాతం గిరిజనులు ఉన్న గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలన్నారు. గిరిజన నాయకుడు డాక్టర్ ఎస్.వరహాలు దొర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు మండలాల ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుళ్లకు బదిలీ

దేవరాపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లకు బదిలీ అయింది. రాము, కూర్మారావు, సాయిలను ఏ.కోడూరు పోలీస్‌స్టేషన్‌కు, సంధ్యను మాడుగుల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే పోలీస్‌స్టేషన్ నుంచి పది రోజుల క్రితం కానిస్టేబుల్ అప్పలనాయుడు విజిలెన్స్‌కు బదిలీ చేశారు.

భవనాల తొలగింపునకు నిధులు

- కేటాయిస్తూ కౌన్సిల్‌లో నిర్ణయం
- సజావుగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న అప్పలనాయుడు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సజావుగా ముగిసింది. తాత్కాలిక చైర్మన్ తమరాన అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లారు. కౌన్సిల్ తీర్మానం మేరకు మెయిన్ రోడ్డును వంద అడుగులకు విస్తరించేందుకు అబిద్‌సెంటర్ ఎన్టీవోహోమ్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థల యజమానులకు తాత్కాలిక తొలగింపు నోటీసులు జారీ చేసినట్టు అజెండాలో పేర్కొన్నారు. చైర్మన్ తమరాన అప్పలనాయుడు ఆదేశాల మేరకు భవనాల తొలగింపునకు యంత్రాలు, సిబ్బంది, వ్యర్థాలు తొలగింపునకు సాధారణ నిధుల నుంచి సుమారు రూ.18 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 40 అడుగుల ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి సంబంధించి 224 మంది ఇళ్లు, షాపు యజమానులకు నోటీసులు జారీ చేశామని, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ఈనెల 10వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగుపరచాలని కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య కోరారు. చైర్మన్ అప్పలనాయుడు కల్పించుకుని వార్డుల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సిద్ధం



ఏవో వాసుదేవరావు

మాడుగుల: రానున్న ఖరీఫ్‌కు సంబంధించి రాయితీపై అందజేసేందుకు విత్తనాలు సిద్ధం చేసినట్టు వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీలుగ, జనుము, పిల్లిపెసర, వరి వంగడాలైన సోనామసూరి, సాంబా మసూరి, ఇంద్ర, స్వర్ణ, ఆర్‌జీఎల్, ఎంటీయూ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆధార్, కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, లేదా 1బి జెరాక్స్ కాపీలను సమీపంలో ఉన్న ఆర్‌బీకేలకు తీసుకువెళ్లి నమోదు చేసుకోవాలని తెలిపారు. మండలంలో 78 క్వింటాళ్ల పచ్చి రొట్ట ఎరువులు, 1,322 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. 30 కిలోల సోనామసూరి బస్తా రూ.1,119 కాగా రాయితీపోను రైతు రూ.818 చెల్లించాలని తెలిపారు. మిగిలిన వరి వంగడాలు 30 కిలోల బస్తాకు రూ.300 రాయితీపోను మిగిలినవి రైతు వాటాగా చెల్లించాలని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

రూ.84 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మిరపల వెంకటరమణ పక్కన ఎంపీటీసీ సత్యనారాయణ

నాతవరం: జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేసేందుకు ప్రభుత్వం రూ.84 లక్షలు మంజూరు చేసినట్టు పెదగొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ తెలిపారు. కుళాయిల ఏర్పాటుకు బుధవారం సర్పంచ్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సహకారంతో నిధులు మంజూరైనట్టు చెప్పారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు పోలి పిల్లమ్మ విగ్రహం పునఃప్రతిష్ఠాపన

వాల్‌పోస్టర్ విడుదల చేసిన డిప్యూటీ సీఎం బూడి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఎంపీపీ రామధర్మజ

మాడుగుల: స్థానిక నవర వీధిలో వెలసిన పోలిపిల్లమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అభిషేకాలు, కోలాటాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వాల్‌పోస్టర్ విడుదల కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వార్డు మెంబరు శీలామంతులు జ్యోతి, ఆలయ వ్యవస్థాపకులు, స్థలదాతలు, నల్లబిడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పశుబీమాపై అవగాహన కల్పించాలి



కె.కోటపాడులో సమావేశంలో మాట్లాడుతున్న సహాయ సంచాలకులు బైరాగి

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు జి.బైరాగి అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని ఆర్బీకేల్లో పనిచేస్తున్న పశువైద్య సహాయకులతో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు మరణిస్తే వాటి యజమానులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని చెప్పారు. పథకం వర్తింపునకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రీమియంను చెల్లించాలని రైతులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు కె.అలేఖ్య, ప్రియాంక, మంజూషారాణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ప్రత్యేకాధికారి సోమశేఖర్, ఎంపీటీసీ లక్ష్మి

కె.కోటపాడు: సచివాలయాల పరిధిలో గల ప్రజలకు వలంటీర్లు చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారని గ్రామ ప్రత్యేకాధికారి సోమశేఖర్ అన్నారు. సింగన్నదొరపాలెం సచివాలయం పరిధిలో గల 13 మంది వలంటీర్లను బుధవారం సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రొంగలి లక్ష్మి, నారపాటి శ్రీరామ్మూర్తి, రొంగలి వెంకటరమణ, వెలగల పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.